క్లుప్తంగా...

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చి మిర్చి 40, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చ కాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 20, దొండ 13, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 40, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 10, ఆలుగడ్డ 20, చామగడ్డ 43, మొరంగడ్డ 17, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 5–6 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న శ్యాం సుందర్

బౌద్ధనగర్: పార్శిగుట్టలోని గోవా పాన్‌షాప్ వద్ద బీజేపీ సీనియర్ నాయకుడు మద్దర్ల శ్యాం సుందర్ నేతృత్వంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాం సుందర్‌గౌడ్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ క్యాంపులో డెంటల్, బీపీ పరీక్షలతో పాటు జనరల్ చెకప్‌లు చేశారు. బీజేపీ నేతలు నాగేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వరూపగౌడ్, రవి ప్రసాద్‌గౌడ్, లడ్డూ, దత్తు పాల్గొన్నారు.

మాణికేశ్వర్‌నగర్‌లో ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మించండి



మాట్లాడుతున్న డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన

లాలాపేట: మాణికేశ్వర్‌నగర్‌బస్తీలో ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆస్పత్రి నిర్మించాలంటూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 18వ రోజుకు చేరుకున్నాయి. మాణికేశ్వర్‌నగర్ వాసులు చేస్తున్న ఈ దీక్షలకు డీబీఎఫ్ నాయకులు కల్పనతో పాటు శంకర్, కాశీనాథ్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు పాల్గొన్నారు.

మురుగు.. పరుగు



మ్యాన్‌హోల్ నుంచి పారుతున్న మురుగు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని స్విమ్మింగ్‌పూల్ రోడ్డులో మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు పారుతోంది. నెల రోజులుగా మురుగు నీరు పారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ మార్గం గుండా వెళ్లాలంటే స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు.

పబ్‌లో గొడవ: భాగస్వామిపై బౌన్సర్ దాడి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని ఓ పబ్‌లో జరిగిన గొడవలో బౌన్సర్ పబ్ పార్ట్‌నర్‌పై దాడికి పాల్పడిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... మాదాపూర్ పర్వత్‌నగర్‌లోని సరోజినీనాయుడు నగర్‌లో నివసించే నెల్లుట్ల హరీష్(27) స్థానికంగా ఉన్న ఓ పబ్‌లో భాగస్వామిగా ఉన్నారు. కొంత కాలంగా హరీష్‌కు మరో పార్ట్‌నర్ కన్నయ్య మధ్య వ్యాపార లావాదేవీల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 20వ తేదీన రాత్రి 10.50 గంటల ప్రాంతంలో హరీష్ బాత్‌రూమ్‌కు వెళ్తుండగా అక్కడున్న బౌన్సర్ సతీష్ ఆయనను అడ్డుకొని అసభ్య పదజాలంతో దూషించాడు. ఇద్దరి మధ్య వాగ్వాదంలో బౌన్సర్ సతీష్ కోపంతో ఊగిపోతూ హరీష్‌పై దాడి చేశాడు. బాధితుడిముక్కు, దవడ దెబ్బతినగా కడుపులో పిడిగుద్దులతో కుప్పకూలిపోయాడు. చంపేస్తానంటూ బెదిరించాడు. బిజినెస్ పార్ట్‌నర్ కన్నయ్య ప్రోద్బలంతోనే బౌన్సర్ సతీష్ ఈ దాడికి పాల్పడ్డాడని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సతీష్ కొంత డబ్బును కన్నయ్యదగ్గర పెట్టుబడిగా పెట్టాడని ఈ కారణంతోనే తనను అడ్డు తొలగించుకునేందుకు గొడవపడి తీవ్రంగా కొట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు బౌన్సర్ సతీష్‌పై పోలీసులు ఐపీసీ సెక్షన్ 323, 506, 341ల కింద కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.



మోండా మార్కెట్ టకారబస్తీలో శుభాకాంక్షలు చెబుతున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు



రంజాన్ వేడుకల్లో డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి

అంబరాన్నంటిన రంజాన్ సంబురం

సనత్‌నగర్ జోన్ బృందం: పవిత్ర రంజాన్‌ను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలోని పలు ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు జరిపారు. సనత్‌నగర్ డీఎస్ఎంకాలనీ మసీదు, ఆల్విన్ మసీదు, సనత్‌నగర్ బస్టాండ్ వద్ద ఉన్న మసీదులతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రంజాన్ సందర్భంగా సనత్‌నగర్‌లోని లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్, బేగంపేట ఓల్డ్ కస్టమ్స్‌బస్తీలోని జామియా మసీదులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు.

తార్నాక డివిజన్‌లో..

లాలాపేట: తార్నాక డివిజన్ వ్యాప్తంగా ముస్లింలు శనివారం రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఓయూ క్యాంపస్, తార్నాక, లాలాపేట, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న మజీద్‌లలో ఉదయం నుంచే ముస్లింల సందడి నెలకొంది. స్థానికంగా ఓ ముస్లిం కుటుంబంలో జరిగిన వేడుకల్లో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి, మోతే శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.



సనత్‌నగర్ లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో ప్రార్థనల్లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

రంజాన్ శుభాకాంక్షలు..

సికింద్రాబాద్: డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ నివాసంలో రంజాన్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. సికింద్రాబాద్‌లోని వివిధ మున్సిపల్ డివిజన్ల నుంచి తరలి వచ్చిన ముస్లిం ప్రముఖులను పద్మారావుగౌడ్ ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు.

ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు..

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని పలు ఈద్గాల వద్ద ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. బాలంరాయిలోని బడీ ఈద్గాలో సుమారు 8 వేల మంది ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. కార్ఖానా, బొల్లారం, బోయిన్‌పల్లి పెన్షన్‌లైన్ ఈద్గాల్లో ముస్లింలు ప్రార్థనలు జరిపారు. రంజాన్ సందర్భంగా రాష్ట్ర బెవరేజేస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్ బాలంరాయి ఈద్గా వద్ద, బొల్లారంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జై ప్రకాష్, బోయిన్‌పల్లిలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముస్లింలను ఆలింగనం చేసుకుని రంజాన్ శుభకాంక్షలు తెలిపారు.



బొల్లారంలో.. బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జై ప్రకాష్



బాలంరాయి ఈద్గా వద్ద.. గజ్జెల నాగేష్

ఎమ్మెల్యే మైనంపల్లికి మంత్రి తలసాని పరామర్శ

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో మోకాలి శస్త్ర చికిత్స చేయించుకున్న మైనంపల్లి కోలుకుంటున్నారు. శనివారం ఆస్పత్రికి వెళ్లిన మంత్రి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా ఆయన కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ఇదే ఆస్పత్రిలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న జలమండలి మారేడుపల్లి జీఎం రమణారెడ్డిని కూడా మంత్రి పరామర్శించి ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు అత్తెల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మైనంపల్లిని పరామర్శిస్తున్న మంత్రి తలసాని

శ్రీనివాసులు గౌడ్‌కు గౌరవ డాక్టరేట్

లాలాపేట: లాలాపేటకు చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది శ్రీనివాసులు గౌడ్ ఇండో ఇజ్రాయెల్ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్, అమెరికా మిస్సిసిపిలోని డే స్ప్రింగ్ క్రిస్టియన్ యూనిర్సిటీ నుంచి సామాజిక సేవా రంగంలో గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఇజ్రాయెల్ రిపబ్లిక్ డేను పురస్కరించుకుని వివిధ రంగాల్లోని ప్రముఖులకు గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. ఇందులో భాగంగానే శ్రీనివాసులుగౌడ్ సామాజిక సేవా రంగంలో కొంత కాలంగా చేస్తున్న సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా డాక్టరేట్‌కు ఎంపికైనారు. ఈ మేరకు శనివారం సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ చర్చిలో జరిగిన డాక్టరేట్‌ల ప్రదానోత్సవం కార్యక్రమంలో పలు రంగాల్లో నిష్ణాతులైన 25 మందికి యూనివర్సిటీ అధికారులు డాక్టరేట్‌లను అందజేశారు. యూనివర్సిటీకి చెందిన ఇండియా డైరెక్టర్ డాక్టర్ ఆమోస్ జేమ్స్ చేతుల మీదుగా శ్రీనివాసులుగౌడ్ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. సంస్థ చైర్మన్ ఆడం రాజు, సినీ నటుడు రాజా తదితరులున్నారు.



గౌరవ డాక్టరేట్‌ను అందుకుంటున్న శ్రీనివాసులు గౌడ్

'గాంధీ'లో ఘనంగా ధరిత్రి దినోత్సవం



మొక్కలు నాటుతున్న సూపరింటెండెంట్ రాజారావు, ఆర్ఎంఓలు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు నేతృత్వంలో ఆస్పత్రి ప్రాంగణంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన జీవితం అందించాలంటే ఇప్పటి నుంచే ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ–1 జయకృష్ణ, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు ప్రభుకిరణ్, అన్నపూర్ణ, వెంకట రమణ, రాము, వసుధ, ఉపేందర్, యోగేందర్, శాంతరాణి, మీనాక్షి, శ్యామ్, జ్యోతి, రోషన్, సత్య, శాంభవి, జీడీఎక్స్ ప్రతినిధులు రవి కుమార్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు భేష్

మహంకాళి ఏసీపీ రమేష్

రాంగోపాల్‌పేట్: మండు వేసవిలో పాదచారులు, వాహనదారులకు చల్లని తాగునీటిని అందించడం అభినందించే విషయమని మహంకాళి ఏసీపీ రమేష్ అన్నారు. శనివారం ఎస్డీరోడ్‌లోని మినర్వా కాంప్లెక్స్ వద్ద అడ్మిరల్ లాజిస్టిక్స్ ఆధ్వర్యంలో చల్లని నీళ్లతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ఆయన మాట్లాడుతూ... వేసవిలో ఎండలు మండుతున్నాయని ఇలాంటి పరిస్థితుల్లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి తాగునీటిని అందించడం మంచి కార్యమన్నారు. సామాజిక స్పృహ ఉన్న వ్యక్తులు ఇలాంటి చలి వేంద్రాలను మరిన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆయన సూచించారు. అడ్మిరల్ లాజిస్టిక్స్ సంస్థ ఎండీ సీడీ చవాన్ మాట్లాడుతూ... వేసవి మొత్తం ఈ చలివేంద్రం కొనసాగుతుందని చెప్పారు. తమ సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు తాము ఆలోచిస్తున్నామన్నారు. మరాఠా యోధుడు శివాజీ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలనే ప్రచారాన్ని ప్రారంభించామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఈ చలివేంద్రం ద్వారా ఈ డిమాండ్‌ను ప్రజల్లోకి మరింత వేగంగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఈ డిమాండ్‌కు మద్దతు తెలిపేవారు ఫోన్: 07941055779కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని కోరారు. ఓట్ ఫర్ శివాజీ జయంతి డాట్‌కామ్ ద్వారా దీనికి మద్దతు తెలుపవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మహంకాళి ఎస్ఐ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ రమేష్

'కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై అవిశ్రాంతపోరు'

లిబర్టీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా.. బీసీ వ్యతిరేక విధానాలపై అవిశ్రాంత పోరాటం చేస్తామని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. మిషన్ 2024 లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు ఢిల్లీ స్థాయిలో పోరాటాలు సాగిస్తామన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఇప్పటి వరకు 'ఓట్లు మావి అధికారం మాది అని' బీజేపీ మాట ఇకపై చెల్లదని స్పష్టం చేశారు. 70 కోట్ల మంది బీసీ ఓట్లతో గద్దెనెక్కిన కేంద్ర ప్రభుత్వం అనంతరం వారిని విస్మరించడం ఎంత వరకు సమంజసమన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీసీలను సంఘటితం చేసి ఐక్య పోరాటాలు సాగిస్తామన్నారు. అనంతరం ఢిల్లీ కేంద్రంగా బీసీ ఉద్యమాలు, ప్రతిఘటన పోరాటాలు ఉంటాయని తెలిపారు.

తీరనున్న లోప్రెషర్ నీటి సరఫరా సమస్య

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ ప్రజలకు ఇక నుంచి తాగునీటి సరఫరాలో లోప్రెషర్ సమస్య పరిష్కారం అవుతుందని డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం కార్పొరేటర్ కార్యాలయంలో బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్‌తో కలిసి ఆమె మాట్లాడారు. గత కొన్నేళ్లుగా డివిజన్ ప్రజలు తాగునీటి సరఫరాలో లోప్రెషర్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారని ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. రూ.13.75 లక్షలతో నూతన తాగునీటి పైప్‌లైన్‌తో పాటు నూతన టి.జంక్షన్ నిర్మాణ పనులకు ఈ నెల 24న ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మాజీ జలమండలి డీజీఎం చంద్రశేఖర్, మేనేజర్ వేణు గోపాల్‌తో కలిసి లోప్రెషర్ నీటి సరఫరా సమస్యపై సమీక్షలు నిర్వహించామన్నారు. డివిజన్ పరిధిలోని ఎల్లయ్యబస్తీలో నూతన సేవరేజ్‌లైన్ పనులు రూ.2 లక్షలతో ప్రారంభిస్తామన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

బంజారాహిల్స్: అర్థిక పరిస్థితి బాగాలేక పోవడం ... అప్పుల బాధ అధికం కావడంతో వాటిని భరించలేని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జూబ్లీహిల్స్ పోలీసుల సమాచారం మేరకు... యూసుఫ్‌గూడ చెక్ పోస్టు సమీపంలోని యాదగిరినగర్‌లో సాహిత్యకుమార్(30) కొంత కాలంగా ఓ యువతితో సహజీవనం చేస్తూ మోతీనగర్‌లో కేవీబీ బ్యాంకులో సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తున్నాడు. గత మంగళవారం సహజీవనం చేస్తున్న యువతి స్వగ్రామం భీమవరం వెళ్లింది. మూడు రోజులుగా డ్యూటీకి రాకపోవడంతో బ్యాంకు అధికారులు సాహిత్యకుమార్‌కు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయకపోవడంతో ఆయన సహజీవనం చేస్తున్న యువతికి ఫోన్ చేసి విషయం చెప్పారు. దీంతో ఆమె శనివారం తెల్లవారుజామున ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరవలేదు. కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. రెండు రోజుల క్రితమే సాహిత్య కుమార్ ఆత్మహత్య చేసుకొని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

బరువు తగ్గేందుకు వెళ్లి.. ఆస్పత్రిలో చేరిన మహిళ

కలర్స్ వెయిట్‌లాస్ సంస్థపై పోలీసులకు ఫిర్యాదు

రసూల్‌పురా: ఓ మహిళ తన బరువును తగ్గించుకునేందుకు వేయిట్‌లాస్ సెంటర్‌లో చేరి ప్రాణల మీదకు తెచ్చుకుంది. బాధితురాలు ఆమె కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్ఖానాకు చెందిన అశోక్ ప్రైవేటు ఉద్యోగి. అతని భార్య మహేశ్వరి 81 కేజీలు బరువు ఉండడంతో టీవీల్లో, సోషల్ మీడియాలో ప్రకటనలు చూసి కార్ఖానలో ఉన్న కలర్స్ వేయిట్‌లాస్ సంస్థలో బరువు తగ్గేందుకు కలర్స్ నిర్వాహకులను సంప్రదించారు. 15కేజీలు తగ్గిస్తామని రూ.40 వేల ప్యాకేజీ ఉంటుందని వివరాలు తెలిపారు. ఈనెల 15న రూ.7 వేలను కట్టి జాయిన్ అయిన మహేశ్వరికి మొదటి రోజు మసాజ్ చేశారు. రెండో రోజు ఎలక్ట్రిక్ వైబ్రేట్ మెషిన్‌తో చికిత్స చేశారు. దీంతో ఆమెకు వాంతులు అయ్యాయి. సిబ్బంది మాములే అని సర్ది చెప్పారు. తిరిగి ఈనెల 21న మరోసారి ఎలక్ట్రిక్ వైబ్రేట్‌తో ట్రిట్మెంట్ చేయడంతో వాంతులు, కడుపులో నొప్పితో కలర్స్ సంస్థలోని వాష్‌రూంలో స్పృహ తప్పి పడిపోయింది. అయినా సిబ్బంది నిర్లక్ష్యంగా పట్టించుకోక పోవడంతో తోటివారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భర్త, బంధువులు మహేశ్వరిని సమీపంలోని నవజీవన్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయమై బాధితురాలు, భర్త అశోక్ కలర్స్ సంస్థపై కార్ఖానా పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.



చికిత్స పొందుతున్న మహేశ్వరి

ప్రదీప్‌కుమార్ సేవలు చిరస్మరణీయం



ప్రదీప్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పించిన మాజీ మంత్రి కృష్ణయాదవ్ తదితరులు

పద్మారావునగర్: సంఘ సేవకుడు, ప్రముఖ నాయకుడు చామకూర ప్రదీప్ కుమార్ 2వ వర్ధంతిని శనివారం పద్మారావునగర్‌లో నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు, పలువురు నాయకులు ప్రదీప్‌కుమార్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్, ప్రదీప్‌కుమార్ తనయుడు సాయి రోహిత్, మోండా కార్పొరేటర్ కొంతం దీపిక, మాజీ కార్పొరేటర్ శీలం ప్రభాకర్, టీడీపీ నాయకులు శ్రీపతి సతీష్, బీజేపీ నాయకులు టి.రాజశేఖరరెడ్డి, వై.సురేష్, ఎ.శ్రీనివాస్ తదితరులు ప్రదీప్‌కుమార్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రదీప్‌కుమార్ వ్యక్తిత్వం, మంచికి మారుపేరుగా నిలిచారన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అభద్రతాభావంతో ప్రజాజీవనం

పంజగుట్ట: ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల దేశప్రజలు అభద్రతాభావంతో మనుగడ సాగిస్తున్నారని.. ప్రశ్నించే వారిపై ఈడీ, సీబీఐ, సీఐడీ దాడులు చేయిస్తున్నారని నవభారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్.కళ్యాణ రామకృష్ణ అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జై యలమంచలికి నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పార్టీ మహిళా అధ్యక్షురాలు పావనితో కలిసి వారు మాట్లాడుతూ... 'భద్రతే మా లక్ష్యం మానవతే మా నినాదం' అనే నినాదంతో ముందుకు సాగుతున్నామన్నారు. అన్ని పార్టీలు మహిళా రిజర్వేషన్ల కోసం మాట్లాడతాయని కానీ అమలు చేయవన్నారు. అయితే తమ పార్టీ కోర్ కమిటీ సమావేశంలోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఉత్తర్వులు తీసుకొచ్చామన్నారు. మహిళల భద్రత కోసం నిర్భయ ఘటన తర్వాత అప్పటి పోలీస్ ఉన్నతాధికారులతో చర్చించి అన్ని పోలీస్ స్టేషన్లలో తమ పార్టీ లెటర్ ప్యాడ్‌పై తమ లీగల్ సెల్ ఫోన్ నెంబర్ పొందుపర్చి ఎవరైనా నిస్సహాయ మహిళలకు ఉచితంగా న్యాయపరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇది పెట్టిన మూడు నెలల్లో సుమారు 200 కేసులు తమ దృష్టికి రాగా అన్ని పరిష్కరించినట్లు తెలిపారు. 25 సంవత్సరాలు అమెరికాలో ఉద్యోగం చేసి భారతదేశ ప్రజలకు ఏదైనా చేయాలనే లక్ష్యంతో వచ్చిన జై యలమంచలి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తారని ధీమా వ్యక్తం చేశారు.



జై యలమంచలికి నియామక పత్రం ఇస్తున్న కళ్యాణ రామకృష్ణ

మెదక్ బిషప్‌పై పోలీసులకు ఫిర్యాదు



ఎస్సైకి ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న మాల మహానాడు, అంసా నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: దళితులను కించపరిచేలా వ్యాఖ్యనించిన బిషప్ పద్మరావుపై ఓయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శనివారం ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్(అంసా), తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో బిషప్ పద్మారావుపై ఎస్సీ, ఎస్టీ అట్రసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రామ్‌కోఠిలోని సీఎస్ఐ చర్చిలో మెదక్ డయోసిస్ బిషప్ పద్మారావు గత నెల 5న ఆదివారం మాల, మాదిగలను కించపరుస్తూ ప్రసంగించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంసా నాయకులు గాజుల ప్రభాకర్, రాహుల్, రవిందర్, నాగరాజు, లక్ష్మీనారాయణ, జయప్రకాష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవీర్ దళ్ యువక నిర్మాణ శిబిరం

బౌద్ధనగర్: వారాసిగూడలో తొమ్మిది రోజుల పాటు జరిగే ఆర్యవీర్ దళ్ యువక నిర్మాణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సార్వదేశిక ఆర్యవీర్ దళ్ అధ్యక్షుడు స్వామి దేవవ్రీత్ సరస్వతి ముఖ్యఅతిథిగా హాజరై ధ్వజారోహణం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్యవీర్‌దళ్ తెలంగాణ ప్రాంతీయ సంచాలకులు ధర్మతేజ మాట్లాడుతూ.. సంస్కృతి రక్ష, శక్తి సంచయనము, సేవ ఈ మూడు ఉద్దేశాలతో ఆర్యవీర్ దళ్ దేశ్యాప్తంగా శిబిరాలను నిర్వహిస్తూ యువతీ, యువకులను ధర్మరక్షకులు, దేశ భక్తులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఈ సంవత్సరం హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, ఆర్యవీర్ దళ్ యువ నిర్మాణ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో నిత్యం ఉదయం 4.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు కార్యక్రమం జరుగనున్నట్లు తెలిపారు. ఆర్యసమాజం మేడిబావి అధ్యక్షుడు ఎంఆర్. రవీందర్ శిబిరార్థులకు ఉచితంగా భోజనం, నివాసం తదితర ఏర్పాట్లు చేశారు. ధర్మపాల్, యశ్వంత్, బాను ప్రకాష్, జయరాజ్; వేదసింధు, ఎల్లయ్య, రాజు, కిరణ్, శ్రావణ్ పాల్గొన్నారు.



ఆర్యవీర్ దళ్ యువక నిర్మాణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

'మినర్వా' రోడ్డు నిర్మాణం వివాదాస్పదం

హిమాయత్‌నగర్: హోటల్ మినర్వా కేఫ్ లైన్‌లో చేపట్టిన రోడ్డు నిర్మాణం వివాదాస్పదంగా తయారైంది. నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టడంతో జలమండలికి చెందిన పైప్‌లైన్ పగిలింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ మహాలక్ష్మి గౌడ్ శనివారం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. రోడ్డు నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించగా అతను రాజకీయ నాయకుల పేర్లు చెబుతున్నాడంటూ కార్పొరేటర్ మహాలక్ష్మి గౌడ్ ఆరోపించారు. విషయం తెలిసి అక్కడకు వచ్చిన ఈఈ పేర్రాజు ఆయా పనులను పరిశీలించారు. త్వరతిగతిన పనులు అయ్యేలా చూస్తానన్నారు. మినర్వా హోటల్ వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో హోటల్ డైరెక్టర్ కృష్ణమనోహర్‌రెడ్డి సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన జెడ్‌సీ మాట్లాడుతూ... కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గడువులోగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయకపోతే కాంట్రాక్టర్‌ను మార్చుతామంటూ స్పష్టం చేసినట్లు సమాచారం.